మాస్టర్ కె. పార్వతీ కుమార్

मस्टर के. पार्वती कुमार

***Master K. PARVATHI KUMAR***

# సప్తగిరి వైభవము

# सप्तगिरि वैभव

# The Splendor of Seven Hills

ధనిష్ఠ धनिष्ठ **DHANISHTHA**

ప్రథమ ముద్రణ : 2004
ప్రతులు : 1,000

అన్ని హక్కులు గ్రంథకర్తవి.

వెల : రూ॥ **15-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్',
14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

ముద్రణ :
ఎక్స్‌లియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం - 530 016.
☏ 2747320, 2751329.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శృతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ",** డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపము లోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "*జగద్గురు మందిరము*" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## *సంకలనకర్త : మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్*

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా  మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగా భ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్** గారు. వారి బోధనలు లెక్కకు మించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియ వచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసర ణీయమై, ఆచరణయోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించుచున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టానందించి, ఆదర్శవంతమైన  వారి సేవలను కొనియాడినది.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే, దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవసేవ" అను మాటకు సరియైన

అర్థము యిదేనని శ్రీ కుమార్‌గారు తమ ప్రవర్తన ద్వారా తెలియపరచు చున్నారు. శ్రీ పార్వతీకుమార్ బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక - మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అనేక గ్రంథముల సంకలనకర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొను చుండుననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు శ్రీ కుమార్‌గారి దృఢవిశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

శ్రీ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశవిదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ముందుమాట

ఈ సప్తగిరి వైభవమును శ్రీ పార్వతీ కుమార్ గారు 1988వ సం॥ జనవరి 27వ తేదీన సప్తగిరులను ఆరోహణముచేయు పాశ్చాత్య బృందమునకు వివరించినారు. వారి అనుయాయు లైన పాశ్చాత్యబృందము శ్రీ పార్వతీకుమార్ గారి బోధనను పదిలపరిచిరి. కాలినడకన సప్తగిరులను ఆరోహణ చేయువారికి ఈ చిన్ని పుస్తకమును తెనిగించి అంకితము గావించు చున్నాము. తెనుగున వాని వివరణము ఆంగ్ల బోధనముకన్న విశిష్టముగ నున్నది.

# సప్తగిరి వైభవము

తిరుపతి ఆధ్యాత్మిక సంపత్తితో కూడిన ఒక దివ్యక్షేత్రం. తిరుమల అను పదం తమిళపదం. "తిరు" అనగా "శ్రీ", "మల" అనగా "కొండ". కావున తిరుమల యనగా "శ్రీ" తత్త్వంతో కూడిన పర్వతము అని అర్థం. శ్రీ పర్వతము నందు వెలసిన దైవం "శ్రీపతి". శ్రీపతినే తమిళులు "తిరుపతి" యని పిలుతురు. శ్రీ పర్వతశ్రేణి యందు వెలసిన శ్రీపతియే వేంకటేశ్వరుడు. వేంకటేశ్వరు డనగా పాపములను హరించు వాడని యర్థం. కలియుగమందలి మానవులను వారి పాపముల నుండి రక్షించు కలియుగ దైవం.

"శ్రీ" అను పదమునకు త్రిమూర్త్యాత్మకమగు వెలుగుయని అర్థం. దానినే వేదమున అదితి యని, గాయత్రి యని, సావిత్రి యని పేర్కొనిరి. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులగు పార్వతి, లక్ష్మి, సరస్వతుల సమాహార స్వరూపమే "శ్రీ". ఆమెయే మూల ప్రకృతి. ఆమె నుండి ఉద్భవించు త్రిగుణముల నుండి ఏడు లోకము లుద్భవించుచున్నవి. అట్టి వెలుగుకు ఆధారభూతమగు పరమాత్మయే "శ్రీపతి". అతని అనుగ్రహమున మన కందించు శ్రీ తత్త్వమే తిరుపతి కొండలు.

ఆంధ్రుల పుణ్యమేమియో తెలియదు గాని, వారి రాష్ట్రమున "శ్రీ" శైలమను మరియొక పుణ్యక్షేత్రము గూడ

యున్నది. అచట అష్టాదశ శక్తిపీఠములోని భ్రమరాంబాదేవి 'శ్రీచక్రరాజ నిలయం'గా విరాజిల్లుచున్నది. ద్వాదశ జ్యోతిర్లింగ ముల లోని మల్లికార్జున జ్యోతిర్లింగము గూడ వెలసియున్నది. అచట పర్వతశ్రేణి కూడ "శ్రీ" తత్త్వం ప్రసరింప జేయుచున్నది.

పరతత్త్వం లేక పరమాత్మ అవ్యక్తుడు. తర్కమున కతీతుడు. అనిర్వచనీయుడు. మాటలకు, వర్ణనలకు అందని వాడు, అద్వైతుడు. బ్రహ్మాదులు కూడ అతనియందు తాదాత్మ్యము పొందగలరే గాని అతని నెరుగలేరు. అతనిని చూచుట యనగా అతని వెలుగును దర్శించుటయే. వెలుగునే దైవమందురు. అట్టి దైవమే "శ్రీ". ఆమె ఆయనను ధరించి యుండుట చేత వెలుగుగ గోచరించుచున్నది. ఉదాహరణకు కనబడని, అంతటా వ్యాపించి యున్న విద్యుత్తు పరమాత్మ కాగా, అట్టి విద్యుత్తు ఆధారముగ ఏర్పడు వెలుగు శ్రీ యగుచున్నది. కనబడునది వెలుగు. దాని కాధారముగ యుండునది విద్యుత్తు.

అట్టి వెలుగు త్రిగుణాత్మకముగ సృష్టి నిర్మాణము చేయు నప్పుడు త్రిమూర్తులు, త్రిశక్తులు, త్రిగుణములుగ ఏర్పడును. వారే వరుసగ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగను, త్రిశక్తులుగ సరస్వతి లక్ష్మి పార్వతులుగను లేక (ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులు) రజస్సు, సత్త్వము తమస్సులను గుణములుగ ఏర్పడుచున్నవి. త్రిమూర్తులు త్రిశక్తులను, త్రిగుణములను ఆధారము చేసుకొని సప్తలోకములను నిర్మాణము చేయుచున్నారు. సప్తావరణములతో

కూడినదియే సృష్టి. అవి త్రిగుణము లాధారముగ ఏర్పడుటచే పురుషసూక్తమున *"సప్తాస్యాసన్ పరిధయః త్రిసప్తః సమిధకృతాః"* అని చెప్పబడినది.

సప్తలోకములకు మూలము "శ్రీ". శ్రీకి మూలము "శ్రీపతి".

ఇట్టి సృష్టి నిర్మాణక్రమము ఏడుకొండల శ్రీనివాసుని పుణ్యక్షేత్రము నందు సమన్వయింపబడినది.

ఏడుకొండలును ఏడు లోకములకు ప్రతీక. అటుపైన శ్రీనివాసు డుండెడి ప్రదేశము శ్రీగిరి (తిరుమల). ఆమెకాధార భూతుడైన శ్రీపతి లేక శ్రీనివాసుడు "శ్రీ వేంకటేశ్వరుడు". ఇట్లు సహజముగ సృష్టినిర్మాణముతో సమన్వయింపబడుట వలన తిరుపతి దేవస్థానము సృష్టికి ప్రతీకయై, వైభవోపేతమై అద్వితీయ మగు పుణ్యక్షేత్రముగ విరాజిల్లుచున్నది. ఇది ఋషి ధర్మము.

కాలి నడకన ఏడుకొండలను ఆరోహణ చేయు సంకల్పము దివ్యము. అట్టి సంకల్పము దైవానుగ్రహ కారణమున ఏర్పడు చుండును. ఏడుకొండలను అధిరోహించుట ఏడు లోకములను దాటుట. అటుపై తిరుమల ప్రవేశం; శ్రీపతి దర్శనం.

సృష్టి నిర్మాణం వలెనే మానవదేహ నిర్మాణం జరిగినది. సప్తధాతువులతో కూడిన మానవ శరీరమున సప్తలోకము లున్నవి. "శ్రీ" యున్నది. "శ్రీపతి" యున్నాడు. కాలి నడకన పయనించు యాత్రికుడు తనయందు, తాను యాత్రచేయు ఏడుకొండల యందు ఈ దర్శనం చేసుకొనుట ఉత్తమ మార్గం.

ఏడుకొండలలో మొదటి కొండ చాల ఎత్తైనది. దీని నధిరోహించుట శ్రమతో కూడిన విషయం. శ్రమ తెలియ కుండుటకై దైవ నామమును హృదయమున స్మరించుచూ అధిరోహించుట శ్రేయోదాయకము. అందులకే ప్రారంభమున అలిపిరిలో శ్రీవారి పాద దర్శనము. దైవ పాదములను నడినెత్తిపై నిడుకొని మూడుసార్లు ప్రదక్షిణ చేసి, శ్రీపతి పాదములకు హారతిచ్చి, “గోవింద” నామమును హృదయమున పదిల పరచుకొని కొండనెక్కుట ప్రారంభింపవలెను.

మొదటి కొండ భౌతిక లోకమునకు ప్రతీక. భౌతిక లోకమున సామాన్యముగ మానవులకు బంధములు హెచ్చు. కుటుంబము, బంధువులు, మిత్రులు, శత్రువులు, వృత్తి వుద్యోగ వ్యాపారములు, స్థిరచరాస్తులు మానవుని బంధించుచునే యుండును. ఈ సమస్తము నందును నామస్మరణము ఆధార ముగ దైవమును దర్శించుట నేర్చవలెను. భార్యాబిడ్డలు, బంధు మిత్రులు, ఆస్తిపాస్తు లన్నిటి రూపమున దైవమే యున్నాడని భావించుటయే నిజమగు స్మరణ. ఇట్టి స్మరణయందున్న వారికి భౌతిక జీవనము బంధించదు. లేనివారికి భౌతిక బంధనము లుండును. ఇది మొదటి కొండ. అధిరోహించుట కష్టతరము.

రెండవ కొండ మనయందలి ప్రాణమయ కోశములకు సంబంధించినది. ప్రాణమయ కోశము నంటిపెట్టుకొనియే కామలోకమున్నది. మానవునియందలి కామమే అతనిని భౌతిక

మున నడిపించుచున్నది. కామము ధర్మముతో కూడియున్నచో బంధము లేదు. అట్లు కానిచో బంధ మేర్పడగలదు. కామ బంధమే మరల మరల జీవులను సంసార చక్రమున నిరంతరము త్రిప్పుచుండును. జీవుడు ఎడతెరిపి లేక జన్మలెత్తుచుండును. తరచుగ ఆవేశకావేశములకు లోనగుచుండును. కామ లోకమున ఆలోచనకన్నా ఆవేశ మెక్కువ. కామము బలీయముగ కలవారికి దైవభక్తి యందు ఆవేశ మెక్కువ. వీరి దైవారాధనము గూడ ఉన్మాదముతో కూడియుండును. మూఢత్వం కలిగియుండును. తాను నమ్మినదే దైవమందురు. తమ సిద్ధాంతమే సత్యమని, ఇతర సిద్ధాంతములు అజ్ఞాన పూరితములని ప్రచారము చేసు కొన్నచో మూఢులై, ఉన్మాదులై, ఉగ్రవాదులై యుందురు. ఇది యంతయు ఆవేశపూరితమైన కామము. దీనికి ప్రధాన కారణము విచక్షణారహితమైన కామమే.

రెండవకొండ ఆరోహణ చేయుట కుపక్రమింపగనే యాత్రికుని ఆకర్షించు తినుబండారములు, పానీయములు అగుపడును. దీక్షతో యాత్రజేయు వారలకు ఈ తినుబండార ములు, పానీయములు వర్జనీయములు. సామాన్యముగ ఇచట యాత్రికులు చతికిలబడి ఇడ్లీలు, వడలు, దోసెలు తినుచూ కాలయాపనము చేయుదురు. రుచికి లొంగుట సర్వసాధారణమే యైననూ అమితముగ భుజించుట అపాయకరము. దేహావశ్య కతను బట్టి తగు మాత్రము భుజించుట ధర్మము. "దేహమును

దుఃఖ పెట్టుచు, శుష్కింపజేయుచూ నా వద్దకు ఏతెంచువాడు నా మార్గమున నడువలేడు” యని దైవము తెలిపినాడు. కనుక, కాలయాపనము లేకుండగ తగు మాత్రము దేహావసరములను తీర్చుకొనుచూ ముందుకు సాగుట శ్రేష్ఠము. తిరుపతి కొండలలో ప్రవహించు జలమును మాత్రము గొని, సేద తీర్చుకొని ముందుకు సాగుట ఉత్తమోత్తమము. రెండవ కొండ మొదటి కొండయంత ఎత్తుగ నుండక మార్గము అనాయాసముగ నుండును. ప్రకృతి రమణీయత, చల్లని గాలులు యాత్రికులకు నూతన ప్రాణము లిచ్చును. దేహము తేలికయగును. మానవ దేహమునందు కామ ప్రవృత్తిని తగు మాత్రము ధర్మపరముగ నిర్వర్తించుచూ జీవించువానికి ప్రాణమయకోశము బలిష్ఠమగుట, దేహము తేలికయగుట జరుగును. యాత్రికునికి ఈ యనుభూతి స్పష్టముగ తెలియును.

మూడవకొండ మనోమయ కోశమునకు ప్రతీక. మనలోని మనోమయకోశము సృష్టిలోని మనోలోకము ఒకటియే. ఇది భావమయ లోకము. మనస్సు నుండి జీవ స్వభావమును బట్టి రకరకములగు భావము లుద్భవించు చుండును. మానవుని భావములకు అతని స్వభావమే వేదిక. స్వభావ మను వేదికపైన పాశవిక భావములు, మానవతా భావములు, దైవీ భావములు ఉద్భవించుటకు అవకాశమున్నది. స్వభావ సముదాయమే జీవునికి విభూతిని గాని, అభూతిని గాని కలిగించుచుండును.

దైవీ భావములు పెంపొందించుకొన్నచో విభూతి, దివ్యానుభూతి కలుగుచుండును. ఆసురీ భావములను పెంపొందించుకొన్నచో జీవితము దుఃఖముల పాలగును. అందువలన మూడవకొండ నధిరోహించు చున్నప్పుడు మనో భావములను దివ్యత్వమువైపు మళ్ళించుచూ కాలిబాటకు యిరువైపులా గల ప్రకృతియందు దైవీవిభూతిని పరికించి చూచుచుండవలెను. అట్లు చూచువానికి తిరుమల కొండలలో గల పవిత్రత గోచరించును. దివ్యత్వము గోచరించును. లేనిచో రాయీ రప్ప, చెట్టూ చేమయే గోచరించును.

మనోమయ కోశము విజ్ఞానమయ కోశమునకు దారి తీయును. అందు దైవీ విభూతులు మెండుగ నుండును. అట్టి దైవీ విభూతికి అర్హత కల్గించునది నిర్మలమగు మనస్సే. కావున నాలుగవ కొండ చేరక మునుపు మూడవ కొండయందు నడక సాగించు సమయమున దివ్యత్వమును భావన చేయుచూ మనసును నిర్మలము, పవిత్రమును గావించుకొనవలెను. దైవము కొరకు చేయు యాత్ర దివ్య భావముతోనే సాగవలెను. అది విహార యాత్ర కాదు గదా! అట్లని మనసున తీవ్రత ఏర్పరచు కొనక సంతోషముగ యాత్ర సాగింపవలెను.

నాలుగవ కొండ ప్రారంభము కాగా యాత్రికునికి ఆహ్లాదము కలుగజేయునట్లుగ, సాధు స్వభావము గల వన్య మృగము లగుపడును. జగద్గురువగు హనుమంతుని దర్శన మగును. నాల్గవకొండ యనగా నాల్గవ లోకము. అది మహ

ర్లోకము. అనగా బుద్ధి లోకము. మానవుని శరీరమున నాల్గవ కోశము- విజ్ఞానమయ కోశము. మనోమయ కోశము నిర్మలము గావించుకొని, దీక్షతో దైవము కొరకే యాత్ర సాగించు మానవునికి విజ్ఞానమయ కోశము వికసించును. దైవ రుచులు పెరుగు చుండగ సద్గురు దర్శనము జరుగును. నాల్గవకొండ యందు హనుమద్దర్శనము- నాల్గవదియగు విజ్ఞానమయ కోశమునందు జరుగు సద్గురు దర్శనమునకు సంకేతము. నాలుగవ కేంద్రము అనాహత కేంద్రము. అది హృదయ కేంద్రము. కారుణ్య భావముతో హృదయమున చేరిన వారికే సద్గురు దర్శనము జరుగును. అటుపై దైవమునకు చేయు యాత్రలో సద్గురువు తోడై నిలుచును. హనుమత్ విగ్రహము దగ్గర యాత్రికులు గురుధ్యానము చేసుకొని ముందుకు సాగవలెను.

నాలుగవ కొండ యంతయూ దివ్యమగు తపోవనముగ స్థూలదృష్టికే గోచరించును. దేవస్థానము వారు కూడ ఈ ప్రాంత మును “తపోవనము” యని ప్రకటించిరి. ఇచ్చట ప్రకృతి సిద్ధము గనే చక్కటి మఱ్ఱిచెట్లు, రావిచెట్లు, దైవీ సంపత్తితో కూడిన అనేక చెట్లు గోచరించును. మఱ్ఱి, రావి, ఔదంబరము వంటి చెట్లను ఆధారముగ గొని తపస్వి జనులు సూక్ష్మ శరీరధారులై నివసింతురని భారతీయ ఋషుల హెచ్చరిక. అందువలన ఈ నాలుగవ కొండయందు నడుచుచున్నప్పుడు ఒక విశాలమగు వృక్షచ్ఛాయలో యాత్రికుడు ఆసీనుడై అదృశ్యమూర్తులైన తపస్వి

జనులను ప్రార్థన గావించి, వారి అనుగ్రహము పొందుటకు ప్రయత్నింపవలెను. ఈ కొండ అనేకానేక దివ్యానుభూతులను ఇవ్వగలదు.

నాలుగవ కోశమగు విజ్ఞానమయ కోశమున సద్గురువు అనుగ్రహముచే సాధకునకు ఎన్నియో దివ్య విభూతులు కలుగు చుండును. స్వప్నమున దివ్యక్షేత్ర దర్శనములు, దివ్య పురుషుల దర్శన స్పర్శన సంభాషణలు, దేవతా దర్శనములు జీవ లక్షణము లను బట్టి యనుభూతము లగుచుండును. దివ్య కళలు అనుభూత మగుచుండును.

నాలుగవ కొండ పరిసమాప్తి యగుసరికి యాత్రలో నరసింహ దర్శనమగును. ఇచట నరసింహుని దేవాలయ మున్నది. ఈ కొండ సద్గురు దర్శనముతో మొదలిడి నరసింహ దర్శనముతో పూర్తియగును. నరసింహ దర్శనము దివ్య దర్శన ములకు పరాకాష్ఠ. అటుపైన దివ్యకళల అనుభూతి నుండి దివ్య నాదానుభూతి లోనికి ప్రవేశించుట జరుగును.

ఐదవకొండ అధిరోహణ చేయనవసరము లేదు. అది ఒక రహదారిగా సాగును. ఆ రహదారిలో వాహనములు కూడ పరుగిడుచుండును. ఈ కొండ ఒక విచిత్రము. రాబోవు కొండ లకు, దాటివచ్చిన కొండలకు నడుమ ఒక వంతెన వలె ఈ కొండ నిలబడి యుండును. కొండకు కుడివైపున గంభీరమగు లోయ వున్నది. ఎడమవైపున జనసంచారము చేయు భౌతిక

ప్రపంచము కనిపించును. చంద్రగిరి పట్టణము కనుపించును. ఎడమవైపు బహిరంగ ప్రపంచము. కుడివైపు గంభీరమగు లోయ. కుడి ఎడమలకు మధ్యగా కొండదారి సాగును.

కుడివైపు గల లోయ ఎంత గంభీరమో అంత పవిత్రము గూడ. దీనిని "తుంబుర వనము" యని పిలుతురు. నిజమున కది తుంబుర వనమే. ఆ లోయ యందు అర్ధరాత్రి గడచిన తరువాత గంధర్వ గానము వినిపించును. ఆ గానము విన్నవారు గూడ కలరు. ఇది ఒక దివ్య విభూతి. లోయలోని నిగూఢమగు ప్రదేశముల నుండి గానము వినిపించును గాని, గాయకులు కనిపించరట! నిర్భీతితో ప్రాణములకు లెక్కచేయక ఈ లోయ లోనికి ప్రవేశించి గానము వినిన సాహసవంతులు చిత్ర విచిత్ర ములుగ వారి అనుభూతులను వర్ణింతురు. వాహన శబ్దములను లెక్కచేయక ఎడమవైపున గల ప్రాపంచిక లోకమును చూడక మౌనముతో కుడివైపు లోయలు సందర్శించుచూ ముందుకు సాగుట బుద్ధిమంతుల పని.

ఐదవకొండ ఐదవ లోకమునకు ప్రతీక. ఐదవ లోకము జనోలోకము. ఐదవకోశము ఆనందమయ కోశము. ఐదవ కేంద్రము విశుద్ధి కేంద్రము. ఈ కేంద్రము నందు గొంతు యందున్నది. మానవ శరీరమందు ఈ భాగము శిరస్సుకు, ఉరస్సుకు మధ్యన వంతెనగా నున్నది. తలకు, మొండెమునకు వంతెనగ మెడ యున్నది కదా! శిరస్సునందు దివ్య లోకములు

గలవు. మొండెము నుండి ఉదర వితానము వరకు శక్తి లోకములు గలవు. అచట నుండి దిగువ భాగము జననేంద్రియముల వరకు పదార్థమయ లోకములు గలవు. జననేంద్రియముల నుండి క్రింది భాగము పాదములవరకు పాతాళ లోకము.

ఐదు కొండలు, ఐదు లోకములు, ఐదు కోశములు పైన వివరింపబడినవి. ఈ ఐదు కోశములు ఐదు భూతములతో పరిపాలింపబడుచున్నవి. అవి వరుస క్రమమున భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము. ఆకాశ గుణము శబ్దము. ఈ కేంద్రము నుండియే శబ్దము నాదముగ వినపడును. అదియే తుంబుర నాదము. ఇంతకు పూర్వము యాత్రికుడు వెలుగుల కళలను యనుభూతి చెందెను. ఇపుడు నాదమును అనుభూతి చెందును. సాధకుని యొక్క సాధనను బట్టియే నాదానుభూతి.

నాదానుభూతి కలుగవలెనన్నచో వాఙ్మయ తపస్సు అవసరము. వాఙ్నియమము అత్యవసరము. వాఙ్నియమము లేని వారు ప్రాపంచిక విషయమున బంధింపబడుదురు. అదియే ఎడమ లోయ. వాఙ్నియమమును పాటించుచూ నాదోపాసనము, ప్రణవోపాసన గావించువారికి నాదము చోటునుండి వినిపించుట సత్యము. అదియే కుడివైపున గల లోయ. అది నాదమయము. అందున్నది తుంబురవనము. ఇది ఐదవకొండ వైభవము. అటుపైన ఆరవకొండ మోకాళ్ళ పర్వతముగా ప్రసిద్ధి గాంచినది.

మోకాళ్ళ పర్వతము పూర్వము మోకాలి యెత్తు గల మెట్లతో నుండెడిది. మోకాలుకు చేయూత నిచ్చుచూ ఎక్కు చుండెడివారు. మొదటి కొండతో పోల్చి చూచినచో ఈ కొండ ఎత్తు చాల తక్కువ. కాని, ఆరోహణము కష్టముగ నుండెడిది.

నాదము, కళ అనుభూతి చెందిన యాత్రికులు తరువాత చేయు దర్శనము బిందు దర్శనము లేక బింబ దర్శనము లేక స్వస్వరూప దర్శనము. ఇది ఆరవ కేంద్రమగు ఆజ్ఞేయములో జరుగును. ఇది జరుగుటకు అహంకారము నశించవలెను. మనలోని అహంకారమును దాటనిదే మనము ముక్తులము కాలేము. అహంకారమే సర్వబంధములకు కారణము. నిట్ట నిలువుగ నుండి అధిరోహణము చేయవలసిన మోకాళ్ళ పర్వతము, మనలోని అహంకారమునకు ప్రతీక. వేంకటేశ్వరుని భక్తులలో అగ్రగణ్యు డగు అన్నమాచార్యుల వారు ఇక్కడనే భంగపడి అమ్మవారి కృపాకటాక్షములతో దైవమును చేరినాడు.

ఆరవకొండను అధిరోహించుట ఆరవ కేంద్రమును చేరుట. ఆరవ లోకమున వసించుట. ఈ లోకమును జనో లోకమందురు. దీనిముందు లోకము తపో లోకము. అటుపైన ఏడవ కొండ దివ్యారామమై అమితానందము కలిగించును. నడక అనాయాసముగ సాగును. సేదదీర్చు చల్లని వాయువు లనుభూత మగును. నిరహంకారమగు జీవప్రజ్ఞ చల్లని వాయువుల ద్వారా దైవ స్పర్శను పొందును. జీవుడు వడివడిగ దైవమును

చూచుటకై ఆరాటముగ నడచును. కలియుగ వైకుంఠ మిదియే యను భావన కలుగును. శరీరమంతయూ గగుర్పాటు చెందును. మనసు ఆనందోత్సాహములతో నిండును. యాత్రా సంబంధిత మైన బడలిక అత్యాశ్చర్యముగ అదృశ్యమగును. ఏడవకొండ పరిసమాప్త మగుచుండగ దైవోన్ముఖుడైన సద్గురు దర్శనము మరల జరుగును. దానికి ప్రతీకగా హనుమంతుని దేవాలయము నిలచి యున్నది. అచట హనుమంతుని ముద్ర చేతులు జోడించి దైవమునకు నమస్కరించుచున్న 'బేడి ఆంజనేయస్వామి ముద్ర'. 'అదిగో దేవాలయము, అందే దైవ మున్నాడు' అని సద్గురువు బోధించుచున్నట్లుగ భక్త హనుమాన్ గోచరించును.

స్వామి వేంచేసియున్న స్థానము శ్రీచక్ర బిందువువలె నారాయణ గిరి శిఖరమునుండి చూచినచో గోచరించును. అందే శ్రీనివాసుడున్నాడు. అతడే 'శ్రీపతి' లేక తమిళభాషలో 'తిరుపతి'.

ఆలయమున శ్రీనివాసుని దర్శనము సర్వపాపహరణము. సర్వారిష్ట వినాశకరము. సర్వ శుభంకరము. స్వామి అభయ హస్తము సమస్త చింతలను పరిహరించగలదు. స్వామి హృదయ మున శ్రీదేవి, భూదేవి దర్శనమిత్తురు. ఈ దర్శనము కేవలము వేంకటేశ్వర విగ్రహమునందే గోచరించును. భూలోకములకు (పదార్థమయ లోకములకు) భూదేవి అధిష్ఠానదేవత. సూక్ష్మ ములు, దివ్యములు అగు లోకములకు శ్రీదేవి అధిష్ఠానదేవత.

శ్రీ వేంకటేశ్వరుడు శ్రీ, భూదేవులను హృదయమున ధరించుట ఒక సమన్వయాత్మకమగు సందేశమిచ్చును. “ప్రజ్ఞామయ లోకములు, పదార్థమయ లోకములు నాయందే యుద్భవించు చున్నవి. అన్నింటిని నేనే ధరించియున్నాను. అన్ని లోకముల యందు వసించియున్నాను. సమస్త లోకములు దివ్యములే. పదార్థము నందు ప్రజ్ఞ సూక్ష్మముగ నున్నది. ప్రజ్ఞ యందు పదార్థము సూక్ష్మముగ నున్నదియని తెలియుము. ప్రజ్ఞయందు, పదార్థమునందు కూడ అంతర్యామిగ నే నున్నానని తెలియుము”. ఇది శ్రీనివాసుడు యిచ్చు సమన్వయాత్మక దర్శనము.

తిరుమల కొండలలో అనేకములైన పుణ్య ప్రదేశములు గలవు. వందల సంవత్సరముల నుండి తపస్సు చేయు బృంద ములు గలవు. పాప వినాశనము, ఆకాశ గంగ, గోగర్భము, శిలా తోరణ ప్రదేశము, నారాయణ గిరి శిఖరము, జాబాలి హనుమంతుని లోయ ఇట్టి ప్రదేశములన్నియూ తపోధనులతో నిండియున్నవని ప్రసిద్ధి.

హిమాలయ పర్వతశ్రేణిలో నాలుగువేల దివ్యౌషధు లున్న వనియూ, తిరుమల పర్వతశ్రేణిలో మూడువేల దివ్యౌషధు లున్న వనియూ దర్శించిన పుణ్య పురుషులు తిరుమల ఆరోగ్యమును కూడ పెంపొందింపగలదని, అనారోగ్యమును నిర్మూలింపగలదని తెలిపిరి.

*ఇది సప్తగిరుల వైభవము, శ్రీ వేంకటేశ్వరుని వైభవము.*